సాక్షి నిర్మల్

గురువారం । 29 । ఆగస్టు । 2024



యాసతోనే భాష మనుగడ

తెలుగు భాష తీయదనం.. తెలుగు భాష గొప్ప దనం.. తెలుసుకున్న వాళ్లకి తెలుగే ఓ మూల ధనం.. అన్నాడో సినీ కవి. నిజానికి తెలుగు భాష మాధుర్యం ఎంతో గొప్పది. 8లో▸

నిలకడగా 'కడెం' నీటిమట్టం

కడెం: కడెం ప్రాజెక్టు నీటిమట్టం నిలకడగా ఉంది. పూర్తి నీటిమట్టం 700(7.603టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 699.300(7.419టీఎంసీ) అడుగులు ఉంది. బుధవారం ప్రాజెక్టులోకి 1,610 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా ఆయకట్టుకు నీరు వదలుతున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.3 /24.4

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ పెరిగి ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైతు అభివృద్ధే దేశ అభివృద్ధి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

పెంబి: రైతులు అభివృద్ధి సాధించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మండల కేంద్రంలో శ్రీవెంకటసాయి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రారంభోత్సవం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్‌కు మహిళలు, రైతులు సాదర స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థను ప్రారంభించారు. సంస్థ కార్యకలాపాలు, ఎరువులు, విత్తనాల సరఫరా, పంటల దిగుబడి, మార్కెటింగ్ సౌకర్యాలపై జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగుచేసి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. మారుమూల గ్రామమైన పెంబిలో 350 మంది రైతుల సమష్టి కృషితో ఉత్పత్తిదారుల సంస్థను స్థాపించడం అభినందనీయమన్నారు. సంస్థ ద్వారా 10 గ్రామపంచాయతీలలోని 18 హ్యాబిటేషన్లలో 4 వేల మంది రైతులకు ఉపయోగపడుతుందన్నారు. సంస్థకు అవసరమైన వసతులు కల్పించడంతోపాటు రైతుల అభివృద్ధికి వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు సూచనలు అందించాలని ఆదేశించారు. సంస్థలో మహిళా రైతుల భాగస్వామ్యం పెంచేలా కృషి చేయాలని సూచించారు. సంస్థ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. రైతులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని లాభాలు పొందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, నాబార్డ్ డీడీ వీరభద్రుడు, జిల్లా ఉద్యానవన అధికారి రమణ, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రమాకాంత్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలమేరకు ఎల్ఆర్ఎస్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ నిబంధన ప్రకారమే ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రెవెన్యూ, నీటిపారుదల, మున్సిపల్ శాఖల అధికారులతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై బుధవారం సమీక్ష నిర్వహించారు. నిబంధనల మేరకు ధ్రువపత్రాలు సమర్పించిన వాటికి మాత్రమే అనుమతి ఇవ్వాలన్నారు. ప్రభుత్వ స్థలాలు, శిఖం, పోరంబోకు భూములలో అనుమతులు మంజూరు చేయొద్దని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాలలో అవసరమైన ధ్రువపత్రాల జాబితా ప్రదర్శించాలన్నారు. అనంతరం ఎల్ఆర్ఎస్‌పై ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్వో భుజంగరావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, సర్వే ల్యాండ్ రికార్డు ఏడీ సుదర్శన్, మున్సిపల్ కమిషనర్లు రాజు, మనోహర్, రాజేశ్‌కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి అనురాధ పాల్గొన్నారు.

ఎన్‌సీసీకి ఎంపిక

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని కస్బా ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్‌సీసీకి ఎంపికయ్యారు. హెచ్ఎం వాణి, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి యాటకారి సాయన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు పరుగు పందెం, కంటిచూపు పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎన్‌సీసీకి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మిలిటరీ అధికారి సుబేదార్ రమేశ్‌కుమార్ మాట్లాడారు. ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమ శిక్షణ అలవడుతుందన్నారు. ప్రత్యేక రిజర్వేషన్లు ఉంటాయని తెలిపారు. నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. కార్యక్రమంలో సుబేదార్ రవికుమార్, హవల్దార్ రమేశ్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో డెంగీ బెల్స్



ఖానాపూర్ పట్టణానికి చెందిన తొంటుకూరి సరిత–శ్రీనివాస్ దంపతుల పెద్ద కుమారుడు రంజిత్(27) జ్వరంతో బాధపడుతూ గత శుక్రవారం రాత్రి మృతి చెందాడు. సదరు యువకుడికి మూడురోజుల క్రితం జ్వరం రావడంతో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అయినప్పటికీ జ్వరతీవ్రత తగ్గకపోవడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి మరణించాడు.



జిల్లా ఏరియా ఆసుపత్రిలో విషజ్వరాలతో చికిత్స పొందుతున్న బాధితులు

- విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు..
- పెరుగుతున్న డెంగీ, చికున్‌గున్యా, మలేరియా కేసులు
- ప్రతీ ఇంట్లో జ్వర బాధితులు
- కాళ్లు, కీళ్లు, ఒంటి నొప్పులతో అల్లాడుతున్న జనం
- దోమలు, పారిశుధ్య లోపమే కారణం
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీనికితోడు వాతావరణ మార్పులు ప్రజారోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఫలితంగా పల్లెలు, పట్టణం అని తేడా లేకుండా అందరూ జ్వరాలబారిన పడుతున్నారు. పల్లెల్లో ఇంటికి ఒకరు మంచం పడుతున్నారు. పది రోజులుగా ఆస్పత్రుల్లో పరిస్థితులను పరిశీలిస్తే సాధారణ రోజుల కంటే 40 శాతం అవుట్ పేషెంట్లు (ఓపీ) పెరిగారు. వీరిలో 15 శాతం జ్వరపీడితులే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

వాతావరణ మార్పులతో..

దగ్గు.. జలుబు.. జ్వరం.. వాంతులు.. విరేచనాలతో జనరల్ ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. వారం రోజుల నుంచి ఓపీ ఎక్కువగా ఉంటోంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా భారీగానే కేసులు నమోదవుతున్నాయి. రోగులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి. ఇప్పటికే జిల్లాలో అక్కడక్కడ మరణాలు సంభవిస్తున్నాయి. పిల్లలకు జ్వరం వచ్చిన వెంటనే తల్లిదండ్రులు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ముఖ్యంగా డయేరియా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్ గున్యా వంటి విష జ్వరాలు, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులతో సతమతమవుతున్నారు.

ఏడేళ్లలోపు చిన్నారులే అధికం...

ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు ప్రైవేటు ఆస్పత్రులు సైతం జ్వరాలతో వచ్చే పిల్లలతో కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా ఏడేళ్లలోపు చిన్నారులు ఎక్కువగా జ్వరాల బారిన పడుతున్నారు. పిల్లల ఆస్పత్రులకు తల్లిదండ్రులు పరుగులు తీస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేట్ ఆస్పత్రులు ఒక్కో పేషెంట్ నుంచి డాక్టర్ ఫీజు, టెస్టుల పేరిట వేలకువేలు వసూలు చేస్తున్నాయని బాధితులు వాపోతున్నారు.

ఆస్పత్రులకు బారులు..

డెంగీ, చికున్ గున్యా, మలేరియా వ్యాధులతో బాధపడుతూ నిత్యం ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు వేలాది మంది బారులు కడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గత నెలలో ఓపీ రోజుకు 1,100 వరకు ఉండగా.. ప్రస్తుతం 1500కు చేరింది. ఇన్‌పేషెంట్లు గతంలో 90 వరకు ఉంటే.. ప్రస్తుతం 120 వరకు చేరింది. సీజనల్ వ్యాధులతోనే ఎక్కువ మంది ఆస్పత్రికి వస్తున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. భైంసా, ఖానాపూర్ వంటి పట్టణాల్లోని ప్రైవేట్ ఆస్పత్రు ల్లో కూడా చికిత్స కోసం చేరుతున్న వారి సంఖ్య భారీగా పెరిగింది.



డాక్టర్ గది వద్ద క్యూలో రోగులు

వారం రోజులుగా జిల్లా ఆస్పత్రి ఓపీ ఇలా..

తేదీ	ఓపీ సంఖ్య
20	1,371
21	1,451
22	1,417
23	1,205
24	1,206
26	1,261
27	1,519
ఇప్పటి వరకు నమోదైన కేసులు(సుమారు)	
టైఫాయిడ్	300
డెంగీ	56
చికున్ గున్యా	80
మలేరియా	40
డయేరియా	400

వారం రోజులుగా చికిత్స..



మొదట జ్వరంతోపాటు బాడీ పెయిన్స్ వచ్చాయి. ఈ నెల 20న జనరల్ ఆస్పత్రికి వచ్చి డాక్టర్‌కు చూపిస్తే అడ్మిట్ కావాలని చెప్పారు. వారం రోజుల నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాను. రెండు రోజుల తర్వాత డిశ్చార్జి చేస్తామన్నారు.

– గంగాధర్, యాకర్ పల్లి

ఇంకా నయం కాలేదు.



మూడు రోజుల క్రితం జ్వరం, కీళ్ల నొప్పులతో నిర్మల్ జనరల్ ఆసుపత్రిలో చూపించుకున్నాను. డాక్టరు పరీక్షలు చేసి ఇక్కడే అడ్మిట్ ఉండమన్నారు. మందులు ఇచ్చారు. అయినా పూర్తిగా తగ్గలేదు. నడవలేకపోతున్నాం.

– చిన్నయ్య, కౌట్ల

అందుబాటులో వైద్యం



సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో మందులు, వైద్యులను అందుబాటులో ఉంచుతున్నాం. పేషెంట్లు ఏ సమయంలో వచ్చినా చికిత్స అందించే ఏర్పాట్లు చేశాం. ప్రజలు ఎక్కువగా వైరల్ ఫీవర్లు, డయేరియా బారిన పడుతున్నారు. అవసరమున్న వారిని అడ్మిట్ చేసుకుంటున్నాం.

– డాక్టర్ సునీల్, జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్

గోవధశాల నిర్మాణంపై ఆందోళన



తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష నాయకులు

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలో గోవధశాల నిర్మాణాన్ని నిరసిస్తూ అన్ని పార్టీల నాయకులతోపాటు స్థానిక ప్రజలు బుధవారం ఆందోళన చేశారు. ఈమేరకు అన్ని పార్టీల నాయకులతో కలిసి గ్రామస్తులు స్థానిక తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకుడు దశరథ రాజేశ్వర్, బీజేపీ మండల అధ్యక్షుడు విలాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య తదితరులు మాట్లాడారు. మండలంలో అతిపవిత్రమైన అతిప్రాచీన ప్రాశస్త్యం ఉన్న అడెల్లి మహాపోచమ్మ దేవాలయంతోపాటు చించోలి(బి) గ్రామ సమీపంలోనే 620 మంది విద్యార్థులతో కూడి మైనారిటీ గురుకులం ఉందని తెలిపారు. ఎంతోమంది నిత్యం వచ్చిపోయే ఆర్టీవో కార్యాలయం, గండిరామన్న హరితవనం, వేంకటేశ్వర స్వామి, కృష్ణుడి ఆలయాలున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ప్రాంతంలో గోవధశాల నిర్మించడం వల్ల ప్రజల మనోభావాలు దెబ్బతినడంతోపాటు ఎంతోమంది ఇబ్బంది పడతారని అన్నారు. గోవధశాలను చించోలి(బి)కి తరలించ వద్దని కోరారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు రాంశంకర్‌రెడ్డి, చంద్రప్రకాశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, చించోలి(బి) మాజీ ఎంపీటీసీ వెంకటరమణారెడ్డి, చించోలి(బి) గ్రామస్తులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ఏఈఈగా కారేగాం యువకుడు



ఏఈఈగా ఎంపికయిన ప్రశాంత్‌కుమార్

ముధోల్: మండలంలోని కారేగాం గ్రామానికి చెందిన ప్రశాంత్ మిషన్ భగీరథ ఏఈఈగా ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన లక్ష్మీ–రాములు కుమారుడు ప్రశాంత్ పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివాడు. తల్లి బీడీలు చుడుతూ, తండ్రి మత్స్యకారుడిగా పని చేస్తూ ప్ర శాంత్‌ను చదివించారు. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమైన ప్రశాంత్ మిషన్ భగీరథ ఏఈఈగా ఎంపికయ్యాడు. పేదరికంలో వికసించిన విద్యాకుసుమం అని ప్రశాంత్‌ను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

పేదింటికి సన్న బువ్వ..!

- రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ
- జనవరి నుంచి అమలుకు నిర్ణయం

జిల్లాలో ఇలా...

ఏఎఫ్ఎస్‌సీ కార్డులు	12,826
ఎఫ్ఎస్‌సీ కార్డులు	1,95,602
అంత్యోదయ కార్డులు	32
మొత్తం రేషన్‌కార్డులు	2,08,460
మొత్తం లబ్ధిదారులు	6,41,186
ప్రతినెలా బియ్యం కోటా	40,56,592 కేజీలు

భైంసాటౌన్: రేషన్ దుకాణాల ద్వారా తెల్ల రేషన్ కార్డు కలిగిన పేదలకు సన్నబియ్యం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వచ్చే జనవరి నుంచి అమలు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని అన్ని రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామని గురువారం జరిగిన రాష్ట్రస్థాయి విజిలెన్స్ సమావేశంలో పేర్కొన్నారు. ఆహార భద్రత కార్డు కలిగిన వారందరికీ సన్నబియ్యం అందిస్తామని చెప్పారు. దీంతో జిల్లాలో 2,08,460 తెల్ల రేషన్ కార్డులుండగా, 6,41,186 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది.

దొడ్డుబియ్యం తినలేక...

ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ప్రస్తుతం దొడ్డు రకం బియ్యం పంపిణీ చేస్తోంది. గతంలో ఇతర నిత్యావసర వస్తువులైన చక్కెర, కిరోసిన్, వంటివి అందించినా, క్రమేణా అన్నింటిని తొలగించి బియ్యం మాత్రమే అందిస్తోంది. కార్డుపై ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున బియ్యం అందిస్తుండగా, చాలా మంది దొడ్డు బియ్యం తినలేక విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందుతున్న బియ్యం, దళారుల ద్వారా తిరిగి రైస్‌మిల్లులకు, అక్కడి నుంచి ఎఫ్‌సీఐ గోదాంలకు, తిరిగి మళ్లీ ప్రజల వద్దకే చేరుతున్నాయి. దీంతో అక్రమార్కులు పీడీఎస్ బియ్యం దందా నిర్వహిస్తున్నారు.

అక్రమ రవాణాకు చెక్...

జనవరి నుంచి ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తే పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడనుంది. చాలామంది దొడ్డుబియ్యం విక్రయించుకుని మార్కెట్‌లో రూ.60 కిలో చొప్పున సన్నబియ్యం తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేయాలన్న వినతులు రావడంతో ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా సన్నబియ్యం పంపిణీపై హామీ ఇచ్చింది. ఈ మేరకు జనవరి నుంచి దాదాపు అమలు చేయనున్నట్లు చెబుతున్నారు. అప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీలకు సన్నబియ్యం అందిస్తుండగా, జనవరి నుంచి రేషన్‌కార్డుదారులకు సైతం సన్నబియ్యం అందించనుండడంతో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు చెక్ పడనుంది.

పశు గణనకు సన్నద్ధం



ఈనెల 20న నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతులకు హాజరైన సూపర్‌వైజర్లు

- సెప్టెంబర్ 1 నుంచి సర్వే..
- 60 మంది ఇమ్యూనైరేటర్లు, 25 మంది సూపర్‌వైజర్ల నియామకం
- తేలనున్న గొర్రెల లెక్కలు
- ఐదేళ్లకు ఒకసారి లెక్కింపు

నిర్మల్‌చైన్‌గేట్: మనుషులకు పశుసంపదకు మధ్య అనేక అనుబంధాలు ఉన్నాయి. ముఖ్యంగా వ్యవసాయ రంగం, పాడి రంగంలో మనుషుల జీవనంతో ముడిపడి ఉంది. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే పశుగణన సెప్టెంబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు నిర్వహించడానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా 396 గ్రామ పంచాయతీల పరిధిలో 16 రకాల పశుజాతుల వివరాలను సేకరించనున్నారు.

జాతీయ స్థాయిలో..

దేశమంతా సెప్టెంబర్ 1 నుంచి పశు గణన చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చేపట్టేందుకు ఆయా జిల్లాల పశుసంవర్ధకశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ గణన ద్వారా ప్రభుత్వ పథకాల ద్వారా ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు పొందిన వారి వివరాలతోపాటు కోళ్ల ఫారాలు ఎన్ని ఉన్నాయనేది కూడా తెలుస్తోంది. మొత్తం మీద గతంతో పోల్చితే పశువుల సంఖ్య ఏమేర పెరిగింది అనేది నమోదవుతోంది.

ప్రత్యేక శిక్షణ....

దేశవ్యాప్తంగా ఐదేళ్లకోసారి అధికార యంత్రాంగం జాతీయ పశుగణన చేపడుతుంది. చివరిసారిగా 2018 అక్టోబర్‌లో సర్వే చేపట్టారు. అంతకు ముందు కాగితాల్లో పశుగణన లెక్కలు చూపించగా 2018లో మాత్రం ప్రత్యేక ట్యాబ్‌ల ద్వారా ఈ గణన చేపట్టారు. అయితే ఈసారి మాత్రం ప్రత్యేక యాప్ ద్వారా డిజిటల్ పద్ధతిలో గణన చేయనున్నారు. దీనికోసం ఇటీవల జిల్లా కేంద్రంలో ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్లకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు.

సర్వేకు 85 మంది సిబ్బంది..

జిల్లాలోని 18 మండలాల్లో అన్ని గృహాలను సర్వే చేసి పశుసంపదను పక్కాగా లెక్కించనున్నారు. ఈ గణనకు 60 మంది ఎన్యూమరేటర్లు, 25 మంది సూపర్‌వైజర్లను నియమించారు. వీరు జిల్లా పశుసం వర్ధక అధికారుల పర్యవేక్షణలో పశుగణన నిర్వహించనున్నారు.

తేలనున్న గొర్రెల లెక్కలు...

జిల్లాలో గొల్ల కుర్మలకు ఆర్థిక చేయూత అందించే దిశగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెచ్చిన సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకం లబ్ధిదారుల్లో నిరాశ మిగిల్చగా పథకం పక్కదారి పట్టిందనే విమర్శలు వచ్చాయి. ఈ పథకంలో రెండు విడతలుగా లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను అందించడానికి నిర్ణయించినా రెండో విడతలో అనేక అడ్డంకులతో పథకం నిలిచిపోయింది. చివరకు లబ్ధిదారులు కట్టిన వాటా ధనం డబ్బులు తిరిగి ఇచ్చేశారు. ఈ 21వ పశుగణనతో గొర్రెల లెక్క కచ్చితంగా తేలనుంది.

యాప్‌లో నమోదు ఇలా..

ఈ సర్వేలో మొత్తం ఆవులు, గేదెలు, ఎద్దులు, కుక్కలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు, బాతులు గాడిదలు, గుర్రాలు ఇతర పెంపుడు జంతువుల లెక్కను యాప్‌లో పొందుపర్చనున్నారు. దీంతోపాటు పశువుల రంగు, జాతి, అవి పనిచేసే శక్తి, ఆవులు, గేదెలైతే పాలిచ్చే సామర్థ్యాల లెక్కింపుతోపాటు వాటి ఆరోగ్య పరిస్థితులను కూడా నమోదు చేయనున్నారు. సంకర జాతి, దేశీయ జాతి పశుసంపదను వేర్వేరుగా సేకరిస్తారు. ప్రతీదానికి ఓ విశిష్ట సంఖ్య కేటాయించి యాప్‌లో నమోదు చేస్తారు.

20వ పశుగణన ప్రకారం జిల్లాలో పశువుల వివరాలు..

ఆవులు	1,79,045
గేదెలు	1,21,193
గొర్రెలు	5,02,576
మేకలు	1,31,866
కుక్కలు	6,301
పందులు	2,981
గుర్రాలు	58

పశువుల లెక్క పక్కాగా..

సెప్టెంబర్ 1 నుంచి జిల్లాలో పశుగణన ప్రారంభం కానుంది. నాలుగు నెలలపాటు కొనసాగే ఈ ప్రక్రియ కోసం ఇప్పటికే ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చాం. ఈ సర్వేతో పశువుల లెక్క పక్కాగా తేలనుంది.

– కె.సురేశ్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

ఇథనాల్ పరిశ్రమతో ఇబ్బందులు ఉండవు

- రైతులకు, పంటలకు నష్టం కలుగకుండా చూస్తాం
- అనుమానాలను శాస్త్రీయంగా పరిశీలిస్తాం..
- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామస్తులు, మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్(ఇన్‌సెట్‌లో)

నిర్మల్‌చైన్‌గేట్: ఇథనాల్ పరిశ్రమతో రైతులు, ప్రజలు, పంటలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ఆ మేరకు తాము చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల రైతులు, విద్యావంతులు, ప్రజలు, పరిశ్రమ ప్రతి నిధులు, సంబంధిత శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. పరిశ్రమపై రైతులు, గ్రామస్తుల సందేహాలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, నీటిపారుదల, అటవీ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఇటీవల ఆందోళన చేసినవారి వాహనాలు జప్తు చేయడంతోపాటు, పలువురిపై కేసులు నమోదు చేశారని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. పోలీస్ శాఖ అధికారులతో చర్చించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పరిశ్రమపై మహిళలు, రైతులు, విద్యావంతులు, యువత సందేహాను లిఖితపూర్వకంగా తహసీల్దార్ స్వాతికి అందించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డివిజనల్ అటవీ శాఖ అధికారి షేక్‌ఆదాం, నాగిని భాను, డీఆర్వో భుజంగరావు, డీపీవో శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికా రి అంజి ప్రసాద్, డీఎంహెచ్‌వో రాజేందర్, దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి

నిర్మల్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి నిధులు వెంటనే విడుదల చేయాలని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం(ఏఐపీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్ష, కా ర్యదర్శులు బోడ అనిల్, మన్నె కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. రానున్న రోజుల్లో విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంక్షేమ వసతి గృహాలకు తక్షణమే సొంత భవనాలు నిర్మించాలని, మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ఏఐపీఎస్‌యూ నాయకులు ఆనంద్, రవి, సాయికుమార్, రిషిత్‌గౌడ్, ప్రవీణ్, లక్ష్మణ్, రా జేందర్, శ్రీకాంత్, శ్రీకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రిమ్స్ ఎదుట ఆక్రమణలు తొలగింపు


దుకాణ యజమానులతో మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ప్రధాన గేటు ఎదుట ఉన్న ఆక్రమణలను ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి బుధవారం తొలగించారు. వీటి వల్ల రిమ్స్‌లోకి వాహనాలతో పాటు అంబులెన్స్‌లు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతుండడంతో పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రిమ్స్ ఎదుట గల రోడ్డుపైకి వచ్చిన ఆక్రమణలను మున్సిపల్ అధికారుల ద్వారా తొలగించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు, రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని దుకాణ యజమానులకు సూచించారు. రోడ్డుపైకి వచ్చేలా షెడ్లు వేయవద్దని సూచించారు. డీఎస్పీ వెంట ఆదిలాబాద్ టూటౌన్ సీఐ కరుణాకర్ రావు, పోలీసు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

బార్‌లో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లో గాల సాయి వైష్ణవి బార్ అండ్ రెస్టారెంట్‌లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. బార్ షట్టర్‌ను పగలగొట్టి దొంగలు బార్‌లోనికి ప్రవేశించారు. మొదటగా సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, కౌంటర్‌లో ఉన్న రూ.30వేల నగదు, రూ.5 వేల విలువ గల 7 మద్యం బాటిళ్లను అపహరించారు. బుధవారం ఉదయం బార్ షట్టర్ తీయడానికి వచ్చిన యజమాని తాళాలు పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్రీడా కెరటాలు..!

- సత్తా చాటుతున్న స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం

ఆదిలాబాద్: ప్రస్తుతం చదువులకు ఉన్న ప్రాధాన్యత క్రీడలకు దక్కడం లేదు. దీంతో సామర్థ్యం ఉన్నా విద్యార్థులు, యువత క్రీడలకు దూరమవుతున్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని, ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రంలో హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో క్రీడాపాఠశాలలను నిర్మించింది. సత్తా ఉన్న విద్యార్థులకు విద్యాబోధన చేస్తూనే క్రీడల్లో వారిని మెరికల్లా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేసింది. కాగా ఈ పాఠశాలల్లోని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి వివిధ క్రీడా వేదికలపై పతకాలు సాధిస్తున్నారు. పలు క్రీడాంశాల్లో గొప్ప నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ భారత క్రీడా ఉజ్వల భవిష్యత్తుపై ఆశలు రేపుతున్నారు. నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా భవిష్యత్తు క్రీడాకారుల గురించి 'సాక్షి' కథనం..


ఆదిలాబాద్‌లోని క్రీడా పాఠశాల

జూడోలో అలేఖ్య సత్తా



క్రీడా పాఠశాలకు చెందిన కొంపెల్లి అలేఖ్య ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. జూడోలో జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటుతోంది. వరంగల్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జీఎఫ్ఐ) రాష్ట్రస్థాయి పోటీల్లో -55 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకంతో మెరిసింది. కేరళలోని త్రిసూర్‌లో నవంబర్‌లో గత సంవత్సరం జరిగిన సౌత్ జోన్ ఎస్జీఎఫ్ఐ పోటీల్లో గోల్డ్‌మెడల్ పొందింది. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చినందుకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఎస్జీఎఫ్ఐ జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా -గోవా కేంద్రంలో ప్రత్యేక శిక్షణకు ఎంపికైంది. ప్రస్తుతం గోవాలో శిక్షణ తీసుకుంటుంది.

రేస్‌వాక్‌లో మెరిక



క్రీడా పాఠశాలకు చెందిన స్ఫూర్తి అథ్లెటిక్స్‌లో భాగమైన రేస్ వాక్ ఈవెంట్‌లో సత్తా చాటుతోంది. రేస్ వాక్ ఈవెంట్‌లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సౌత్ జోన్ -2023 పోటీల్లో స్వర్ణ పతకం సాధించింది. అదే సంవత్సరం హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లోనూ ప్రాతినిధ్యం వహించి శభాష్ అనిపించుకుంది.

బాక్సింగ్ ఆశా కిరణం షోయబ్



క్రీడా పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న షోయబ్ మాలిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చుతున్నాడు. ఈ ఏడాది హైదరాబాద్‌లోని లాలాగూడలోని రైల్వే స్టేడియంలో జరిగిన తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో 52 -55 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్‌తో మెరిశాడు. నోయిడాలో మూడవ సబ్ జూనియర్ జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు. జాతీయస్థాయి క్రీడాకారుడిగా ఎదగడమే తన లక్ష్యమని షోయబ్ పేర్కొంటున్నాడు.

పతకాల ఆనంది



పదవ తరగతి చదువుతున్న ఆనంది 400 మీటర్ల పరుగుల పోటీల్లో విజేతగా నిలుస్తోంది. 2023లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సౌత్ జోన్ పోటీల్లో 400 మీటర్ల ఈవెంట్‌లో కాంస్య పతకం గెలిచింది. అదే సంవత్సరం హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించింది. 2023లోనే హన్మకొండలో జరిగిన ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో 600 మీటర్ల ఈవెంట్‌లో రజత పతకంతో రెండో స్థానంలో నిలిచింది. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన ఎస్జీఎఫ్ఐ జాతీయ స్థాయి పోటీల్లో 600 మీటర్ల ఈవెంట్‌లో ప్రాతినిధ్యం వహించింది. ఇటీవల సరూర్‌నగర్ స్టేడియంలో మూడవ జాతీయ జావెలిన్ దినోత్సవం పురస్కరించుకొని జరిగిన పోటీల్లో 400 మీటర్ల ఈవెంట్‌లో స్వర్ణ పతకంతో మెరిసింది.

పరుగుల యువ'రాజ్'



క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న యువరాజ్ 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నాడు. 2023లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సౌత్ జోన్ పోటీల్లో 100 మీటర్ల ఈవెంట్‌లో కాంస్య పతకం గెలిచాడు. అదే సంవత్సరం హన్మకొండలోని జవహర్ లాల్‌నెహ్రూ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు.

ఆటో, బైక్ ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు


తీవ్ర గాయాలపాలైన యువకుడు

నిర్మల్‌టౌన్: ఆటో బైక్ ఢీకొన్న ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆటో డ్రైవర్ షేక్ సోహెల్ నిర్మల్ బస్టాండ్ నుంచి ప్యాసింజర్లతో విశ్వనాథ్‌పేట్‌కు వెళ్తున్నాడు. ఎదురుగా బైక్‌పై వచ్చిన సారంగాపూర్ మండలం జామ్ గ్రామానికి చెందిన తోకల శ్రీనివాస్, రంకుల వెంకటరమణ, మల్లిలాస్మన్నలు అతివేగంగా ఆటోను ఢీకొట్టారు. దీంతో బైక్ కిందపడడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా వెంకటరమణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

భార్య మరణం తట్టుకోలేక భర్త మృతి


బండేవార్ పోశెట్టి (ఫైల్)

తానూరు: ఎన్నో ఏళ్లుగా కలిసి ఉన్న భార్య మృతిని తట్టుకోలేని భర్త మనస్తాపంతో మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన బండేవార్ పెంటుబాయి (88), పోశెట్టి (92) వృద్ధ దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. కాగా పెంటుబాయి సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. భార్య మృతిని తట్టుకోలేక ఆమె భర్త పోశెట్టి సైతం మంగళవారం రాత్రి మృతిచెందాడు. కాగా వృద్ధ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉండగా వారందిరికి వివాహాలు జరిగాయి. రోజు వ్యవధిలో ఇద్దరూ మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.

యాసతోనే భాష మనుగడ

- స్థానిక మాండలికంతోనే భాష మనుగడ సాధ్యం
- జిల్లా కవుల వాడుకభాష శైలి విభిన్నం
- నేడు తెలుగు భాషా దినోత్సవం

నిర్మల్‌ఖిల్లా: తెలుగు భాష తీయదనం.. తెలుగు భాష గొప్పదనం.. తెలుసుకున్న వాళ్లకి తెలుగే ఓ మూలధనం.. అన్నాడో సినీ కవి. నిజానికి తెలుగు భాష మాధుర్యం ఎంతో గొప్పది. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ప్రపంచ వ్యాప్తంగా దాదాపు పది కోట్లకు పైగా మంది తెలుగు భాష మాట్లాడుతున్నారు. దేశంలో 22 అధికారిక గుర్తింపు కలిగిన భాషల్లో ఒకటిగా వెలుగొందుతున్న తెలుగు భాషకు మూలం ద్రావిడ భాష. ఆంధ్రప్రదేశ్ అధికారిక భాష చట్టం ద్వారా 1966లో తెలుగును రాష్ట్ర అధికారిక భాషగా ప్రభుత్వం ప్రకటించింది. ఏటా ఆగస్టు 29న తెలుగు కవి గిడుగు వెంకట రామమూర్తి జయంతి నేపథ్యంలో తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం.


పదోతరగతి విద్యార్థులు రచించిన తెలుగు నీతికథల పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం (ఫైల్)

తెలుగు నీతి కథలతో కూడిన పుస్తకం

తెలుగు భాషపై అమితమైన అభిమానంతో ఏకంగా తెలుగు నీతి కథలతో కూడిన పుస్తకాన్ని రాశారు విద్యార్థులు. దాదాపు 15 సంవత్సరాల వయసు కలిగిన పదో తరగతి విద్యార్థులు 19 మంది కలిసి ఏకంగా కథల సంపుటి రాశారు. నిర్మల్ జిల్లాలోని సోన్ మండలం వెల్మల్ బొప్పారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతేడాది పదవ తరగతి చదివిన విద్యార్థులు దాదాపు 20 కథలను రాసి దాన్ని గ్రంథస్తం చేసి పుస్తకంగా ప్రచురించారు. తెలుగు భాషపై ఉన్న అమితమైన మక్కువతోనే పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు పోతన్న ప్రోత్సాహం, ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్ తోడ్పాటుతో విద్యార్థులు గ్రంథస్తం చేయడం భాషపై వారికి ఉన్న ఆసక్తిని, అనురక్తిని చాటుతోంది.

'గిడుగు' చెప్పిందేమంటే..


గిడుగు రామమూర్తి పంతులు (ఫైల్)

ప్రముఖ తెలుగు సాహితీవేత్త, వ్యవహారిక భాష పితామహుడు, వాడుక భాష కోసం ఉద్యమం సాగించిన గిడుగు వేంకట రామమూర్తి పంతులు మొదటి నుంచి గ్రాంధిక భాషను కాకుండా పల్లె జనం, సాధారణ ప్రజానీకం మాట్లాడుకునే వ్యవహారిక భాషను మనుగడలో ఉంచాలని అనేక ప్రయత్నాలు సాగించారు. ఆయన సాగించిన ఉద్యమం నుంచే ప్రస్తుత వాడుక భాష ప్రాచుర్యంలోకి వచ్చింది. ఎంత నగరీకరణ జరిగినా, పామరుడుకి అర్థమైనప్పుడే భాషకు విలువ అని నొక్కి చెప్పారు. తన చివరి శ్వాస వరకు వాడుక భాషకే జీవం పోశారు.

వృత్తి వైద్యం.. ప్రవృత్తి కవిత్వం


డా. అప్పాల చక్రధారి, సాహితీవేత్త

నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యుడు, సాహితీవేత్త అప్పాల చక్రధారి. చిన్నపిల్లల వైద్య నిపుణులుగా పనిచేసే వీరు సామాన్య పాఠకులకు అర్థమయ్యే రీతిలో సరళమైన శైలిలో కవిత్వం రాస్తున్నారు. సామాజిక స్పృహ కథాంశాలను కవిత వస్తువులుగా తీసుకొని చెప్పదలుచుకున్న అంశాన్ని బలంగా, నిరాడంబరంగా స్పష్టంగా తెలియపరుస్తారు. తెలుగు భాషలోని స్థానిక మాండలిక తెలంగాణ యాస, వ్యవహారికంలోనే ఆయన కవితలు ఉంటాయి.

భాషాభిమానంతోనే రోజుకో కవిత


అంబటి నారాయణ

నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడు అంబటి నారాయణ ప్రతీరోజు ఓ కవిత రాస్తూ నిత్య కవితా చైతన్యుడిగా పేరొందుతున్నారు. తెలుగు అక్షరధనంతోనే అజ్ఞానాన్ని పారదోలుతామని, తెలుగు భాషతోనే అమృతహస్తాన్ని అందిస్తామని ఆయన అంటారు. భాషతోనే కీర్తి, స్ఫూర్తి.. మానవీయబాటకు బాసటగా నిలుస్తామని కవిత్వంలో చెబుతున్నారు.

భాష పరిరక్షణ మన బాధ్యత



మాతృభాషలో విద్యాబోధన కొనసాగినప్పుడే విద్యార్థులకు చక్కగా అర్థమవుతుంది. విద్యార్థులు కూడా తమ మనసులోని భావాలను మాతృభాషలోనే వివరంగా వ్యక్తపరుచగలుగుతారు. వ్యవహారిక భాష అంటే ప్రజలు తమ నిత్య వ్యవహారంలో ఉపయోగించే భాష.

– కొండూరి పోతన్న, తెలుగు ఉపాధ్యాయులు, కవి, బోరిగాం, మం. సారంగాపూర్

నిధులొచ్చాయ్..!


వృత్తివిద్య కోర్సులపై అవగాహన కల్పిస్తున్న శిక్షకురాలు

- వృత్తివిద్య కోర్సుల కోసం విడుదల
- ఉమ్మడి జిల్లాలోని 29 పాఠశాలల్లో కోర్సులు అమలు

మంచిర్యాలఅర్బన్: జాతీయ విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన బడుల్లో నూతన హంగులు సమకూర్చాలనే ఉద్దేశంతో పీఎంశ్రీ అమల్లోకి తెచ్చింది. పాఠశాలస్థాయి నుంచి విద్యార్థులకు చదువుతో పాటు ఉపాధి కల్పనకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో వృత్తివిద్య కోర్సుల అమలుకు చర్యలు చేపట్టింది. ఆయా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి విద్యాభ్యాసం పూర్తి కాగానే ఉద్యోగవకాశాలు పొందేలా తోడ్పాటునందించనున్నారు.

29 పాఠశాలల్లో..

రాష్ట్రంలోని 88 కేజీబీవీలు, 14 గురుకుల విద్యాలయాల్లో 2023 -24 విద్యా సంవత్సరంలో వృత్తివిద్య కోర్సులు ప్రారంభమయ్యాయి. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 29 పాఠశాలల్లో వృత్తివిద్య కోర్సులకుగాను నిధులు విడుదలయ్యాయి. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులు బోధిస్తుండగా సామగ్రి, విద్యార్థుల బోధనకు అవసరమైన పరికరాల కొనుగోలుకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

ఎన్ఎస్‌డీసీ సహకారంతో..

జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ) సహకారంతో వృత్తివిద్య కోర్సులను ఆయా పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. వృత్తివిద్య కోర్సుల నిర్వహణ వొకేషనల్ ట్రైనింగ్ పార్టనర్స్(వీటీపీ)కు అప్పగించారు. ఆయా సంస్థల నిపుణులైన శిక్షకులను నియమించి తరగతులు ప్రారంభించారు. పదోతరగతి వరకు ఉన్న పాఠశాలల్లో రెండు దశల్లో కోర్సులు అమలు చేస్తున్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు లెవల్ -1 పేరిట విలువైన సమయాన్ని వృథా చేయకుండా వృత్తివిద్య కోర్సులు బోధిస్తున్నారు. రెండో దశలో విద్యార్థులు కిందటి తరగతిలో పేర్కొన్న కోర్సుకు తగిన శిక్షణ, క్షేత్రస్థాయి అవగాహన కల్పిస్తున్నారు. మిగితా రెండు దశలను ఇంటర్మీడియెట్ వరకు ఉన్న విద్యాసంస్థల్లో అమలు చేయనున్నారు. విద్యార్థులు సులభంగా నేర్చుకునేలా వ్యవసాయం, బ్యూటీపార్లర్, దుస్తులు మేడ్ అప్‌లు, గృహోపకరణాల అలంకరణ, బ్యూటీ అండ్ వెల్‌నెస్, ఐటీ టెక్నాలజీ, ప్లంబర్, క్రీడలు, ఫిజికల్ ఎడ్యుకేషనల్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. అవసరమైన సామగ్రి కొనుగోలుకు, పాఠశాల విద్యార్థులకు అవసరమైన జిరాక్స్‌లు తీసుకునేందుకు నిధులు మంజూరయ్యాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిధుల వివరాలు

జిల్లా	పాఠశాలల సంఖ్య	సామగ్రి కొనుగోలు	జిరాక్స్ (వర్క్‌బుక్స్, హ్యాండ్‌బుక్స్)
ఆదిలాబాద్	06	రూ.2,35,000	రూ.45,000
కుమురంభీం	07	రూ.1,88,000	రూ.35,000
మంచిర్యాల	12	రూ.4,23,000	రూ.70,000
నిర్మల్	04	రూ.1,41,000	రూ.25,000

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- వివరాలు వెల్లడించిన నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను నిర్మల్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ గంగారెడ్డి వివరాలు వెల్లడించారు. హర్యానా రాష్ట్రానికి చెందిన మహ్మద్ అబ్బాస్ అనే వ్యక్తి గత 15 సంవత్సరాల క్రితం నిర్మల్‌కు వచ్చి స్థానిక గాజుల్‌పేట్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇక్కడే స్థిరపడి 13 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. ఇతనికి ఐదుగురు పిల్లలు ఉన్నారు. స్థానిక గాంధీ కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్నాడు. వచ్చిన డబ్బులు సరిపోక జలసాలకు అలవాటు పడి రాత్రి 1 గంట నుంచి ఉదయం 4 గంటల సమయంలో రెక్కీ నిర్వహించి చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈక్రమంలో జూలై 5న కిల్లా గుట్ట, జూలై 12న సోమవార్ పేట్, జూలై 22న పింజారి గుట్ట, ఈనెల 4న కురన్నపేట్, 18న ఖిల్లాగుట్ట ఇలా వరుస దొంగతనాలకు పాల్పడ్డాడు. గతేడాది అక్టోబర్‌లో ఖానాపూర్‌లోని ఓ ఇంట్లో దొంగతనం చేశాడు. క్లూస్ టీం సభ్యులు దొంగతనం చేసిన చోట మహ్మద్ అబ్బాస్ వేలిముద్రలు దొరకడంతో నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇందుకోసం జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు ప్రత్యేక టీం ఏర్పాటు చేసి హర్యాన, నాందేడ్ పోలీసుల సహకారంతో హర్యాన నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడిన వారందరిని విచారించారు. అబ్బాస్ దొంగతనాలకు పాల్పడుతున్నాడని గుర్తించి అతడిని చాకచక్యంగా పట్టుకున్నారు. అతని వద్ద 150 గ్రాముల గంజాయి, 2 తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి విక్రయించే వారిపై, దొంగతనాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెట్టామన్నారు. ఇళ్లు, దుకాణ సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన టౌన్ సీఐ ప్రవీణ్ కుమార్, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సైలు రమేశ్, సాయికృష్ణ, రవి, గోపి, కానిస్టేబుల్ తిరుపతి, గణేశ్, హోంగార్డు సతీశ్‌లను ఎస్పీ జానకి షర్మిల అభినందించారు. సమావేశంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై రమేశ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా 'గోదావరి' హారతి

బాసర: శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో గోదావరి నదీ హారతి ఘనంగా నిర్వహించారు. ఆలయ వైదిక బృందం ఆధ్వర్యంలో ప్రతీ బుధవారం సాయంత్రం 6.30 గంటలకు గోదావరి నది ఘాట్1 వద్ద గోదావరి హారతి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. గోదారమ్మకు అభిషేకం, అర్చన, హారతి ప్రత్యేక పూజలు చేశారు. సనాతన కల్చరర్ ఆర్గనైజేషన్ ఫౌండర్ చైర్మన్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో సాంస్కృతిక నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఆలయ ఈవో విజయ రామారావు ఉన్నారు.

వైద్య పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లోని వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిన ప్రొఫెసర్‌లు, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీఏఎస్ ఆర్ఎంవో, సీఏఎస్ సీఎంవో పోస్టులను భర్తీ చేయనున్నట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెల 4న రిమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించే వాక్‌ఇన్ ఇంటర్వ్యూలకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. వివరాలకు వెబ్‌సైట్ adilabad. telangana. gov. in లేదా rimsadilabad. org లేదా ఫోన నంబర్లు 08732 -359573, 98480 57606, 94400 57799లలో సంప్రదించాలని సూచించారు.

ట్రాక్టర్, బైక్ ఢీ.. ఇద్దరు మృతి


శ్యాంరావు (ఫైల్)


సంతోష్ (ఫైల్)

మామడ: మండలంలోని తాండ్ర సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. వస్తాపూర్ గ్రామానికి చెందిన శ్యాంరావు (47), సంతోష్(25)లు ద్విచక్రవాహనంపై వస్తాపూర్ నుంచి తాండ్రకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆడే సంతోష్, ట్రాక్టర్ డ్రైవర్ ఆడే గంగాప్రసాద్‌లు సొంత అన్నదమ్ములు. ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను ఢీకొట్టిన గంగాప్రసాద్, ప్రమాదం అనంతరం ట్రాక్టర్‌ను నిలపకుండా వెళ్లిపోయాడు. ఉదయం పంటచేలకు వెళ్లే వారు ప్రమాదాన్ని చూసి సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ నవీన్‌కుమార్, ఎస్సై సందీప్‌లు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కోచ్ సాయి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలకు చెందిన 8 మంది బాక్సింగ్ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైయ్యారని ఆదిలాబాద్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేగ్, శిక్షకుడు సాయి బుధవారం తెలిపారు. వీరు ఈనెల 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో జరగనున్న ఆర్ఈసీ బాక్సింగ్ టాలెంట్ హంట్ -సబ్ జూనియర్, జూనియర్ పోటీల్లో పాల్గొంటారన్నారు. అండర్ 17 విభాగంలో నిహారిక, భగత్, అండర్ 14 విభాగంలో అనూష, అశ్విని, రామ్ చరణ్, షోయబ్ మాలిక్, నిఖిల్, పవన్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. వీరు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అభినందనలు తెలిపారు.